క్లుప్తంగా

మట్టి వినాయకుడు పర్యావరణానికి హితం

పెనమలూరు:వినాయక చవితి పండుగ సందర్భంగా కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులు ఆదివారం మట్టి విగ్రహాలను తయారు చేశారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో వినాయకుడి విగ్రహాలు తయారు చేయటం వల్ల పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. అందరూ మట్టి వినాయకుడి విగ్రహాలతోనే పండుగ చేసుకోవాలని సూచించారు. దాదాపు 150 మంది విద్యార్థులు మట్టి వినాయకుడి విగ్రహాలను తయారు చేశారు.

ఇద్దరికి గాయాలు

పెనమలూరు:కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలవ్వటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన ఓగిరాల ప్రణవ్‌శివ సాయి కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి ఏడాది చదువుతున్నాడు. ఆయన సోదరి బిందు మాధవి పీవీపీ సిద్ధార్థలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతుంది. శుక్రవారం వీరు కాలేజీకి బైక్‌పై వస్తుండగా కానూరు వందడుగుల రోడ్డు మలుపులో ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై నుంచి ఇద్దరు పడిపోవటంతో గాయపడ్డారు. వీరిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఓగిరాల ప్రణవ్ శివసాయి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు ఎస్ఐలు, 22 మంది కానిస్టేబుళ్లు బదిలీ

పెనమలూరు: స్థానిక పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు ఎస్ఐలు, 22 మంది కానిస్టేబుళ్లను ఆదివారం బదిలీ చేశారు. మూడురోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ పి.జాషువా సందర్శించి, పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎస్ఐలుగా పని చేస్తున్న శేషకుమార్, రాజేష్‌ను వీఆర్‌కు పంపారు. నాలుగు రోజుల క్రితం మరో ఎస్ఐ అర్జున్‌రాజును బదిలీ చేశారు. దీర్ఘకాలికంగా ఈ పోలీస్‌స్టేషన్‌లోనే విధులు నిర్వహిస్తున్న 22 మంది పోలీసు సిబ్బందిని బదిలీచేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

సందడి.. సందడిగా..




వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో విగ్రహాల అమ్మకాల చిత్రాలు..

- గ్రామాల్లో పండుగ వాతావరణం
- జోరుగా గణపతి విగ్రహాల విక్రయాలు

పెనమలూరు: వినాయకచవితి పండుగను ఘనంగా చేసుకోవటానికి భక్తులు సిద్ధమయ్యారు. పండుగ సోమవారం ఉదయం 10 గంటల తరువాత ప్రారంభమవుతుందని పండితులు తెలపటంతో గ్రామాల్లో సందడి మొదలైంది. కానూరు, తాడిగడప, పోరంకి, కృష్ణనగర్, పెనమలూరు జంక్షన్‌లలో వినాయకచవితికి ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. మట్టి వినాయకుడి విగ్రహాలతో పాటు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వినాయకుడి విగ్రహాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. అదే విధంగా పూలు, పండ్లు, పూజా సామగ్రి కూడా తీసుకొచ్చి కూడళ్లలో అమ్మారు. మండల పరిధిలో దాదాపు 40 వినాయకుడి పందిళ్లు వేశారు. రంగురంగు విద్యుద్దీపాలతో పందిళ్లు అలంకరించారు. మనగ్రామంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడి విగ్రహాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. భక్తులు వాహనల్లో వచ్చి విగ్రహాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లారు. వినాయక చవితి పండుగ సందర్భంగా భక్తులు పూర్తిగా సహకరించాలని పోలీసులు కోరారు.

ఉషారామ ఆధ్వర్యంలో..

ఉంగుటూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుడి విగ్రహాలను గ్రామాల్లో పంపిణీ చేస్తున్నట్లు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ తెలిపారు. తేలప్రోలులోని ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పొట్టిపాడు, తేలప్రోలు గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నేల, నీరు, చెట్టు, పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటిని ఆరాధించడం మన సంస్కృతిలో భాగమని, అందరూ కాలుష్యరహిత వినాయక విగ్రహాలను వినియోగించాలని పేర్కొన్నారు. రెండు రోజులుగా విద్యార్థులు వెయ్యి మట్టి విగ్రహాలను తయారు చేశారన్నారు. కాలుష్యానికి కారణమయ్యే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలనే వాడాలని కోరారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



కానూరులో మట్టి వినాయకుడి విగ్రహాలతో విద్యార్థులు

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని మట్టి వినాయకుని ప్రతిమలను వినియోగించి పర్యావరణాన్ని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టార్గెట్ బాల్‌లో కృష్ణాకు తృతీయ స్థానం



ట్రోఫీ అందుకుంటున్న కృష్ణా జిల్లా జట్టు

కంకిపాడు: ఫస్ట్ ఏపీ సబ్ జూనియర్స్ టార్గెట్ బాల్ టోర్నమెంట్‌లో కృష్ణా జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. టార్గెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ టార్గెట్ బాల్ పోటీలు వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో ఆదివారం నిర్వహించారన్నారు. టోర్నమెంట్‌లో కృష్ణా జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచిందన్నారు. క్రీడాకారులు పామర్తి పూజ, కె.హాసిని, మోటేపల్లి స్తుతి, ఎస్.కె.సనమెహరీన్, కె.కార్తీక, భీమవరపు నందిని, ఎల్.మోక్షిత అద్భుత ఆటతీరు ప్రదర్శించారని, క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.





ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

పెనమలూరు:కానూరులో ఆదివారం విశ్వకర్మ జయంతి ఘనంగా చేశారు. అశోక్ నగర్‌లోని ప్రాణశక్తి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యోగాశక్తి చికిత్స చేసే డాక్టర్ మాకాల సత్యనారాయణను సన్మానించారు. మనిషి దేహంలో అద్భుతమైన వైద్య శక్తి ఉంటుందని ఎటువంటి మందులు వాడకుండానే యోగాశక్తి చికిత్సతో వ్యాధులు నయం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.శివకుమార్, పి.వరదరాజులు, సులోచన, అంబటి ప్రవళిక పలువురు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సాయినగర్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్వకర్మ జయంతి పతాకాన్ని విశ్వబ్రాహ్మణుల సంఘ నేతలు ఆవిష్కరించారు. అనంతరం విశ్వకర్మకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణుల సంఘం పట్టణ అధ్యక్షులు పుట్టా రాంబ్రహ్మం, సంఘ నేతలు అంబుల విష్ణు, రాపాక వెంకటచారి, చిట్రోజు సత్యనారాయణచార్యులు, విశ్వనాధుల శేషాచారి, నందిగం నవరత్నచారి, దొరపూడి బ్రహ్మం పాల్గొన్నారు.



విశ్వకర్మకు పూజలు చేస్తున్న భక్తులు

దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ

ఉయ్యూరు: దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ అని పలువురు వక్తలు కొనియాడారు. విశ్వకర్మ జయంతి మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వకర్మకు పూజలు జరిపించారు. కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ, నాయకులు షేక్ అబు కలాం, బిస్మిల్లా ఖాన్, శానిటరీ ఇన్‌చార్జి సంతోష్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌బీఐ స్ట్రీట్ వద్ద విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ సంఘం నాయకుడు వెలమర్తి రవిబాబు మాట్లాడారు. మండల కన్వీనర్ ఎదురువాడ శ్రీనివాసరావు, ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు, బీజేపీ మండల అధ్యక్షుడు తోట మురళీధర్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని అధికారిక పండగ్గా ప్రకటించడం విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించడమేనని ఏపీ ఎఫ్ఎస్ఎల్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నున్న గ్రామంలోని విశ్వబ్రాహ్మణ కాలనీలో ఆదివారం విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌతంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ పండుగగా ప్రకటించడం హర్షణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు, ఏపీ స్వర్ణకారుల సంఘం నాయకులు కర్రి వేణు మాధవ్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజయవాడ నగర అధ్యక్షుడు సాయికిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్మా కోటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, నున్న విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగు జ్యోతి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్ఫామ్ నాయకుల సమావేశం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు వేలేరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇంటెలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ (ఇన్ఫామ్ ఇంటర్నేషనల్) రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఇన్ఫామ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు గెద్దం బాపిరాజు, రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షల జనాభా కలిగిన మాదిగ సామాజికవర్గానికి జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో సీట్ల కేటాయింపు చేపట్టాలని కోరారు. వచ్చే నవంబర్ నెలలో విజయవాడలో ఇన్ఫామ్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు 15 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాల్లో టికెట్లు కేటాయించాలని కోరారు. రాష్ట్ర ఎంఈవోల సంఘం అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, అరుంధతీయ బంధు సేవామండలి రాష్ట్ర అధ్యక్షుడు మట్టా వరసాయి ప్రసాద్, దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్, బొమ్ములూరు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్, ఎంపీటీసీ సభ్యురాలు కుందేటి శిరీషా రాంబాబు, ఇన్ఫామ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పిడి రాంసాగర్, కార్యనిర్వాహక కార్యదర్శి యరసాని శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఇన్ఫామ్ ప్రతినిధులు



రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు 67వ క్రీడా సమాఖ్య నియోజకవర్గ స్థాయి బాల, బాలికల అండర్ 14, 17 ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న బాలురకు 8 క్రీడాంశాల్లో, 20న బాలికలకు వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 21న బాలికలకు ఏడు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలను నియోజకవర్గ జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు.

ఎస్టీ కాలనీలో రగ్గులు పంపిణీ



పెనమలూరు: మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో హెబ్రోన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. బ్రదర్ భక్తసింగ్ 23వ వర్ధంతి సందర్భంగా ఎస్టీకాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రదర్ రజనీష్ పాల్గొన్నారు. ఎస్టీ కాలనీ వాసులకు ప్రార్థనా మందిరం నిర్మాణం చేశామని, పేదలకు ఉచితంగా రగ్గులు, బైబిల్‌లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వో దేప్రియుడు, ఎస్టీ కాలనీ పేదలు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి


హనుమాన్‌జంక్షన్‌రూరల్: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి తెలిపారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు ముందస్తుగా పోలీసుల అనుమతి పొందాలని చెప్పారు. మండపం ఏర్పాటు చేస్తున్న స్థలం, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు, ఏ రోజున నిమజ్జనం చేస్తారో పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని సీఐ నరసింహామూర్తి ఆదేశించారు. గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించకుండా నిర్వహించాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీ సభ్యులదేనని ఆయన హెచ్చరించారు. ఎస్ఐలు ఏడీఎల్ జనార్దన్, తిరుమలరావు, ఏఎస్ఐలు సాయిబాబు, రామచంద్రరావు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు

పెనమలూరు:ఇంటి ముందు ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వేణుగోపాలస్వామి గుడి ప్రాంతానికి చెందిన షేక్.నూర్ బాబు కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. ఆయన తన మామయ్య షేక్.బాబి వద్ద బైక్ తీసుకుని పనిపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి పార్కు చేశాడు. శనివారం ఉదయం ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.



జగనన్న భూ హక్కు పత్రాలు సిద్ధం



విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా భూముల రీ సర్వే నిర్వహిస్తోంది. భూముల రీ సర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రైతులకు(యాజమాన్యపు హక్కు పత్రం–పట్టాదారు పాస్ పుస్తకాలు) జగనన్న భూ హక్కు పత్రాలను అందజేసేందుకు సిద్ధం చేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలంలోని షాబాదు, జక్కంపూడి, వేమవరం, కొత్తూరు.తాడేపల్లి, అంబాపురం గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం జరుగుతోంది. వీటిల్లో షాబాదు గ్రామంలో రీ సర్వే పూర్తయినట్లు తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి తెలిపారు. ఆ గ్రామంలో 110 మంది రైతులకు సంబంధించి 250 ఎకరాల భూములున్నాయి. వాటికి గాను రైతులకు 80 జగనన్న భూ హక్కు పత్రాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. వాటిని మండలంలో తొలి విడతగా షాబాదు గ్రామంలో రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలను అందజేయనున్నారు. రైతులకు సంబంధించి భూముల సర్వే నంబర్లు, ఎల్పీ నంబర్లను నమోదు చేయడం, భూ విస్తీర్ణం నమోదుతో పాటు మాగాణి, మెట్ట భూముల నమోదు వివరాలు పూర్తి అయిన పిదప గ్రామంలో గ్రామసభను ఏర్పాటు చేసి గ్రామసభలో రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తారు. ఈ రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో రైతులకు జగనన్న హక్కు పత్రాలను అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

గన్నవరం: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉపకులాల యువతకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి న్యాయం చేయాలని కోరారు. సంఘ నాయకులు బత్తుల శీనయ్య, తిరివీధి పాపారావు, ఇందుపల్లి ప్రసాద్, రాజారత్నం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





